
ధర్మపురిక్షేత్రంలో..

హరహర మహాదేవ..

- తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- బారులుతీరిన భక్తులు.. కిటకిటలాడిన ఆలయాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం శివాలయాలు కిటకిటలాడాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని గచ్చిబౌలి, కొండాపూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్‌లలోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. శివయ్యకు ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం భక్తులు దర్శనం చేసుకున్నారు. పలుచోట్ల భక్తులే స్వయంగా జలాభిషేకం,పాలాభిషేకం చేశారు.

శివ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు


ఇందిరానగర్ ఆలయంలో..

బీరంగూడలో..

పటాన్‌చెరు టౌన్: శివరాత్రిని పురస్కరించుకుని అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. ఈఓ శశిధర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


చందానగర్‌లో..


చందానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మల్లికార్జునస్వామి

భ్రమరాంబ తల్లి

పటాన్‌చెరు ఉమామహేశ్వర దేవస్థానంలో..


గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అభిషేకం చేస్తున్న భక్తులు


శివలింగానికి పాలాభిషేకం


మియాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీలో శివుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్


ధర్మపురిక్షేత్రంలో..


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో.. బారులు తీరిన భక్తులు


పూజలో పాల్గొన్న భక్తులు


చేవెళ్ళ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, రవికుమార్‌లను సన్మానించిన నిర్వాహకులు


తారానగర్‌లో..


తారానగర్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

రాజకీయ శాస్త్రవేత్త ప్రొ.జోయాహసన్


ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

రాయదుర్గం: మహిళా సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ జోయాహసన్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆరవ అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కౌంట్ హర్ ఇన్: జెండర్ ఈక్వాలిటీ త్రూ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళలను ప్రోత్సహిస్తే తమ సత్తా చాటుతారని అన్నారు. ఏఎంయూ డైరెక్టర్ ట్రిబాక్ న్యూఢిల్లీ మాజీ ప్రొఫెసర్ అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత జరుగుతుందన్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, హిస్టరీ విభాగం ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడారు. కార్యక్రమంలో జేఎన్‌యూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, మనూ ఓఎస్‌డీ-1 ప్రొఫెసర్ షుగుఫ్తా షాహీన్, మనూ ఎకనామిక్స్ గౌరవ ప్రొఫెసర్ అమితాబ్ కుందు, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు ప్రొ.అమీరుల్లాఖాన్, మాజీ వీసీ ప్రొ. రహమతుల్లా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, కో కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ముస్తాజాబ్ ఖతీర్ ప్రసంగించారు.

వెలగని స్ట్రీట్ లైట్లు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు


అండర్ బ్రిడ్జి నుంచి రైల్‌విహార్ కాలనీ నాలా వరకు చీకటిగా ఉన్న దృశ్యం

- లింగంపల్లి రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫారమ్ వైపు వెలగని వీధి దీపాలు
- పది రోజులుగా అవస్థలు పడుతున్న రైలు ప్రయాణికులు

శేరిలింగంపల్లి: నగర శివారులో అతిపెద్ద రైల్వే స్టేషన్, భారీ సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే లింగంపల్లి రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫారమ్ వైపు పది రోజులుగా సుమారు ఒక కిలోమీటరు వరకు స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు. ముఖ్యంగా లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రైల్ విహార్ కాలనీ సమీపంలోని నాలా వరకు లైట్లు వెలగకపోవడంతో ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ పరిసర కాలనీలు, బస్తీలు ఉండడం.. ఎక్స్‌ప్రెస్ రైళ్ళు, ప్యాసింజర్ రైళ్లతో బాటు ఎంఎంటీఎస్



రైళ్ళు సికింద్రాబాద్, నాంపల్లి, ఫలక్‌నామ వరకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్ట్రీట్ లైట్లు వెలగపోవడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. ముఖ్యంగా దొంగల భయంతో బాటు కుక్కలు కూడా సంచరిస్తుండడంతో భయపడాల్సిన దుస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్ పట్ల ఇదేం నిర్లక్ష్యం అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సన్మానం


మహిళా దినోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతను సత్కరిస్తున్న ప్రతినిధులు

రాయదుర్గం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో కాంగ్రెస్ నాయకుడు భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ గచ్చిబౌలి డివిజన్ పారిశుద్ధ్య మహిళా కార్మికులు, ఆశావర్కర్లు, టీచర్లు, డాక్టర్లు, షీ టీమ్ ప్రతినిధులు, మహిళా పోలీసులు, స్ట్రీట్ వెండర్లు, సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత గౌడ్, ఇతర మహిళా ప్రతినిధులను భరత్ కుమార్, కృష్ణాగౌడ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగార్జున స్కూల్ హెచ్ఎం సుందరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరికి కరోనా

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం 8 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, ఇద్దరికి పాజిటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకులు మనోహర్ తెలిపారు.

తెలంగాణ టీ చాంపియన్‌షిప్- 2024


తెలంగాణ టీ చాంపియన్‌షిప్ 2024 విజేతలు

మాదాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్ఐసీసీలో తెలంగాణ టీ చాంపియన్‌షిప్- 2024ను నిర్వహించారు. మహిళలు టీని తయారీలో తమ ప్రతిభను చాటారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ లో గురువారం రాత్రి హైబీజ్ టీవి పోటీల్లో మహిళలు పెట్టిన ఛాయ్‌ని జ్యూరీ సభ్యులు రుచి చూశారు. అత్యధిక పాయింట్లు సాధించిన 12 మందిని విజేతలుగా నిర్ణయించారు. మొదటి బహుమతి కె.జ్యోత్స్న లక్షరూపాయలు, రెండవ బహుమతి వరలక్ష్మి రూ.50వేల రూపాయలు, మూడవ బహు మతి పి.జ్యోత్స్నకి రూ. 25వేలు, ఇద్దరికి రూ.10వేల చొప్పున ఐదుగురు విజేతలకు నగదును, బహుమతులను అందజేశారు. నటి సుమయారెడ్డి, శ్రీ చక్ర మిల్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బ్రహ్మయ్య, నేషనల్ జనరల్ సెక్రటరీ క్రెడాయ్ జి.రాంరెడ్డి, హైబీజ్ టీవి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజ్‌గోపాల్, సీఈఓ జె.సంధ్యారాణిలు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ జాగృతియాత్ర



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ జాగృతి యాత్రను ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేషన్ సభ్యుడు పట్లోళ్ళ శ్రీరామ్‌యాదవ్ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామ న్నారు. కనీస సౌకర్యాల కల్పన, నాణ్యమైన భోజనం, ఫెలోషిప్స్, ఫెసిలిటీస్‌ని అందిస్తూ ఫీజులను తగ్గించే విధంగా ఈ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రభాకర్‌సింగ్, నేహ జయరాజ్, శ్రీరామ్ యాదవ్, ప్రణతి, దారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

100 అడుగుల రోడ్డు.. మురుగు సమస్య

మాదాపూర్ అయ్యప్పసొసైటీలో ఇబ్బందిపడుతున్న ప్రజలు

మాదాపూర్: మాదాపూర్ అయ్యప్పసొసైటీలో వంద అడుగుల రోడ్డులో మురుగునీరు పారుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో వేసిన పైప్‌లైన్ చిన్నది కావడం.. జనాభా పెరిగిపోవడంతో మ్యాన్‌హోల్స్ నిండి మురుగు రోడ్డుపైకి వస్తోందని, దుర్వాసన తట్టుకోలేకపోతున్నామని అధికారులు స్పందించాలని కోరారు.

- మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఎక్కువగా హాస్టల్స్, అద్దె భవనాలను నిర్మించడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.
- ప్రధాన రహదారులపై మురుగునీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు
- మురుగు సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.
- సాయినగర్, చంద్రనాయక్‌తండా తదితర ప్రాంతాలలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందని, చిరు వ్యాపారులు వ్యర్థాలను డ్రైనేజీలో వేయడంతో నీరు నిలిచిపోతోందని , రోగాలు వస్తున్నాయని పేర్కొన్నారు
- అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని కోరుతున్నారు.


అయ్యప్పసొసైటీ వంద అడుగుల రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు

మహిళలు దృఢంగా ఉండాలి


కొండాపూర్‌లోని అపోలో క్రెడిల్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళలు, డాక్టర్ల బృందం

గచ్చిబౌలి: మహిళలు దృఢంగా ఉంటేనే సమాజం కూడా బాగుంటుందని సినీ నటి కుషిత కల్లపు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కొండాపూర్‌లోని అపోలో క్రెడిల్‌లో 'స్ట్రాంగ్ ఉమెన్, స్ట్రాంగ్ భారత్' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబం పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో తమ పట్ల కూడా అలాగే ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో బాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు చెకప్ చేయించుకొని వైద్యుల సలహాలను పాటించాలన్నారు. అపోలో క్రెడిల్ ప్రసూతి గైనకాలజిస్ట్ డాక్టర్ సుధామాధురి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండటం చాలా కీలకమన్నారు. అపోలో క్రెడిల్‌లో ప్రేమ అప్యాయతతో మహిళలకు సంరక్షణ అందిస్తున్నామన్నారు. గైనకాలజిస్టులు డాక్టర్ వంగళ్ళ పద్మిని శిల్ప, డాక్టర్లు శ్వేతా సికర్వార్, హారికారెడ్డి, నందిని ప్రసంగించారు.

శివోహం పెయింటింగ్ పోటీలు ప్రారంభం

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో 3 రోజుల పాటు జరగనున్న శివోహం పెయింటింగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ మనలో ఉన్న భక్తిని అనేక రకాలుగా చూపవచ్చని ,చిత్రకారులు పెయింటింగ్ రూపంలో చూపుతారన్నారు. వారి కళను వెలుగులోకి తెచ్చే క్రమంలో ప్రతి సంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు 32మంది కళాకారులు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం చివరి రోజు ఉత్తమ పెయింటింగ్‌లకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు రాంప్రతాప్, ఎన్. రామకృష్ణ, శివరామకృష్ణలతో పాటు పెద్ద ఎత్తున కాలనీవాసులు పాల్గొన్నారు.

భూమి పూజ


భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

గచ్చిబౌలి: మసీద్ బండ గ్రామంలో నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠకు శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్ కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్, బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్, స్థానికులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.7 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ఓ వ్యక్తి రూ.7 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 1వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఓ ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేశాడు.పెట్టిన నగదుతో పాటు, లాభాలు చూపిస్తూ వచ్చారు .అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.7 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వమని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి వద్ద నుంచి..

ఆధార్ కార్డు ఇల్లీగల్ అకౌంట్లకు లింక్ ఉందని చెప్పి బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ యువతి వద్ద నుండి రూ. ఒక లక్ష నలభైఎనిమిది వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ యువతికి ఫిబ్రవరి 14వన ఫోన్ కాల్ వచ్చింది. ముంబై పోలీసులమని, నీ ఆధార్ కార్డు ఇల్లీగల్ బ్యాంక్ అకౌంట్లకు లింక్ ఉందని, నీ పైన కేసు నమోదైందని బెదిరించి ఆ యువతి వద్ద నుండి ఒక లక్ష 48 వేలు కాజేశారు.దీంతో బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


సర్వశ్రీ కుమార్ (ఫైల్)

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గచ్చిబౌలి పోలీసులు గుర్తించారు. ఈ నెల 4వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో గోపన్‌పల్లిలోని వైన్‌షాపు వెనుక సిట్టింగ్ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్వశ్రీ కుమార్(55). ఎన్‌టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఐస్‌క్రీం బండి నిర్వహిస్తున్నాడు. వైన్ షాపులో మద్యం కొనుగోలు చేసి తాగి పడిపోయాడు. వైన్‌షాపు నిర్వాహకులు గమనించి గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ కిందపడి సైక్లిస్ట్ మృతి


రమేష్ బెహ్రా(ఫైల్)

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు ట్యాంకర్ కింద పడి ఓ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేందర్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన రమేష్ బెహ్రా(43) శ్రీరాంనగర్ కాలనీ ఏ బ్లాక్‌లో నివాసం ఉంటూ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో శ్రీరాంనగర్‌కాలనీ సీ బ్లాక్‌లో సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంకర్ వెనక టైరు కింద పడటంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.